# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 21 ఫిబ్రవరి 2023


## స్థానిక సంస్థల కోటాలో వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామసుబ్బారెడ్డి



కడప, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బ్యూరో :

స్థానిక సంస్థల వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి రామసుబ్బారెడ్డిని ఆ పార్టీ ప్రకటించింది. ఉమ్మడి కడప జిల్లా స్థానిక సంస్థల కోటాలో రామసుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. 2016లో తెలుగుదేశం ప్రభుత్వంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యారు. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీకి రాజీనామా చేసి జమ్మలమడుగు నుండి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో రామసుబ్బారెడ్డి ఓటమి పాలయ్యాడు. అనంతరం 2020లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రస్తుతం కర్నూలు ఉమ్మడి జిల్లా వైసిపి రీజినల్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రామసుబ్బారెడ్డిని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సోమవారం ఆయన పేరును ప్రకటించారు. దీంతో జమ్మలమడుగుకు చెందిన రామసుబ్బారెడ్డి అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పురుష మృగ వాహనం సేవకు 40వేల విరాళం



రాయచోటి టౌన్ .ఫిబ్రవరి20

ప్రభాతవార్త

రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే పురుష మృగ వాహన సేవకు హెల్పింగ్ హ్యాండ్ యూత్ క్లబ్ సభ్యులు వెంకటరమణ, శశిధర్, శ్రీనివాసులు, సంతోష్ 40 వేల రూపాయలు విరాళంగా ఆలయ చైర్మన్ విజయమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు వారి సంఘం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటరమణ, గౌరవ సలహాదారు శశిధర్ మాట్లాడుతూ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలులో బాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.

# టిడ్కో డిపాజిట్లు చెల్లించేదెన్నడు?

## మొరపెట్టుకుంటున్న బాధితులు - 5 ఏళ్ల క్రితం రూ.25 వేలు జమ - ఇంత వరకూ ఊసే లేదు - ఇల్లు లేదు... డబ్బు లేదు...

బద్వేలు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

గత ప్రభుత్వం టిడ్కో ఆధ్వర్యంలో సింగల్, డబుల్ బెడ్ రూమ్ గృహాలు మంజూరు చేస్తున్నామని, అర్హత కలిగిన లబ్ధిదారులు 25 వేల రూపాయలు అకౌంట్‌లో జమ చేయాలని డబ్బులు కట్టించుకున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధికారులు ప్రతి ఒక్క లబ్ధిదారుని నుండి 25 వేల రూపాయలు డీడీ రూపంలో చెల్లించారు. ఇప్పటికి ఐదేండ్లు పూర్తవుతున్నా ఇల్లు కానీ, డబ్బు కానీ ఊసే లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో నిర్మాణాలు బద్వేలులో రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇంత వరకూ డబ్బు చెల్లించకపోగా బాధితులకు సరైన సమాధానం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. డబ్బు కట్టిన బాధితులంతా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఐదేండ్లు దాటినా డబ్బు చెల్లించకపోవడంపై పలు అనుమానాలున్నాయి. మున్సిపాలిటీ అకౌంట్‌లో బాధితులకు సంబంధించిన డబ్బు ఉన్నప్పటికీ లబ్ధిదారులకు చెల్లించడంలో ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని మండి పడుతున్నారు. గత ప్రభుత్వంలో డబ్బు



టిడ్కో గృహాలకు పునాది వేసిన దృశ్యం

చెల్లిస్తే ఈ ప్రభుత్వంలో బాధితులకు వెనక్కి ఇవ్వడంలో కూడా కక్ష సాధింపేనా అన్నట్లుగా మండి పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమో? అలసత్వమో? తెలియదు కానీ టిడ్కో బాధితులు మాత్రం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగల్, డబుల్ బెడ్ రూమ్ గృహాలు ప్రభుత్వమే నిర్మిస్తుందని, ఇక ఇల్లు నిర్మించుకోవలసిన అవసరం లేదని ఎంతో ఆశగా ఎదుచూసిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. ఐదేండ్ల క్రిందట రూ.25 వేలు చెల్లిస్తే ఇంత వరకూ తెచ్చిన అసలుకు వడ్డీ ఎంత అవుతుందో అని బాధితులు వాపోతున్నారు. సొంతింటి కల నెరవేరుతుందని, 5 సంవత్సరాల క్రితం డబ్బులు అప్పులు తెచ్చి చెక్కు రూపంలో అధికారులకు అందజేశారు. 4 నెలల్లో బిల్లు చేతికి వస్తుందని, ఇక ఇబ్బంది ఉండదని అనుకున్న సామాన్య, పేద కుటుంబాలలో వెలుగులు నింపాల్సిన ప్రభుత్వాలు చీకటిని నింపడమేగాక ఇచ్చిన డబ్బులు కూడా వెనక్కి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుంది. సామాన్య, నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది బాధితులు తమ ఆవేదన వెల్లబుచ్చుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బద్వేలు మున్సిపాలిటీలో 250 మందికి పైగా లబ్ధిదారులు లక్షల రూపాయలు పైగా చెల్లించినప్పటికీ ఇంత వరకూ ఊసే లేదు. ఇల్లు లేదు, డబ్బు లేదు అన్న చందంగా మారింది టిడ్కో గృహాల పరిస్థితి. ఎప్పటికి డబ్బులు వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఇప్పటికైనా బాధితుల గోడు ఆలకించి త్వరగా టిడ్కో సంబంధించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించండి

### -వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

రాయచోటి .ఫిబ్రవరి20 ప్రభాతవార్త

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్, కౌటింగ్ ప్రపోజల్ పెండింగ్ లేకుండా త్వరగా పంపించాలన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల క్లెయిమ్స్ ఏఈఆర్‌వో, ఈఆర్‌వోల దగ్గర పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరగా క్లియర్ చేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఫారం 7, టీచర్స్ ఫారం 8 పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, ఎంసిసి టీం ఎన్నికల ఉల్లంఘన పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.



### ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పక పాటించాలని : జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్

ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ గిరిష పిఎస్ సంబందిత అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, ఎంసిసి టీం ఎన్నికల ఉల్లంఘన పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల విధుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

## హత్యరాలలో కన్నులపండువగా రథోత్సవం

### భారీగా తరలివచ్చిన భక్తులు

### బండలాగుడు పోటీలకు పోటెత్తిన భక్తులు



కళ్యాణ త్రేతేశ్వరుని రథంపైకి తీసుకెళుతున్న దృశ్యం, బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

హత్యరాలలో సోమవారం త్రేతేశ్వరస్వామి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. వేలాదిమంది భక్తుల శివనామ స్మరణ మధ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణం అనంతరం కళ్యాణత్రేతేశ్వరునిగా సతీసమేతంగా ఆలయం నుంచి స్వామిని ఊరేగింపుగా రథంపైకి తీసుకు వచ్చారు. రథంపై స్వామి ఆశీనులైన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. భక్తులు రథోత్సవానికి భారీగా తరలివచ్చారు. మండుటెండలో జై త్రేతేశ్వర అంటూ రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. అనంతరం సాయంత్రం హత్యరాలలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీల్లో పాల్గొని వృషభరాజులను అదిలిస్తూ చెర్నాకోలుతో వృషభరాజులను కదిలించి బండలాగుడు పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో హత్యరాల ట్రస్టుబోర్డు ఛైర్మన్ వెలగచర్ల సుబ్బారెడ్డి, ఇఒ కొండారెడ్డి, మార్కెట్‌కమిటి ఛైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుదారులకు చిరుధాన్యాల పంపిణీ

### చిరుదాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### పౌర సరఫరాల సంస్థ ద్వారా మద్దతు ధరతో రైతులల నుండి ఆర్బికేల ద్వారా కొనుగోలు

### రివ్యూ మీటింగ్‌లో పౌరసరఫరాల సంస్థ కమీషనర్ అరుణ్‌కుమార్, విసి, ఎండి వీరపాండ్యన్




కడప, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

రాష్ట్రంలో పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా రైస్ కార్డుదారులకు.. బియ్యంకు ప్రత్యామ్నాయంగా రాగి, జొన్న చిరుధాన్యాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనుందని.. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కమీషనర్ హెచ్.అరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కడప కలెక్టరేట్ లోని విసి హాలులో చిరుధాన్యాల కొనుగోలు ప్రక్రియకు సంబంధించి.. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ విసి, ఎండి జి. వీరపాండ్యన్ తోకలిసి.. ఆ శాఖ కమీషనర్ హెచ్. అరుణ్ కుమార్ వైఎస్ఆర్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల జేసీలు, పౌర సరఫరాల శాఖ డిఎంలు, డిఎస్‌ఓలు, డీసీఎస్‌ఓలు, మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులతో ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశానికి వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు, జేసీ సీఎం సాయికాంత్ వర్మ, నంద్యాల జిల్లా జేసీ టి. నిశాంతి, శ్రీ సత్యసాయి జిల్లా జేసీ టి.ఎస్. చేతన్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్ మీనా, ప్రశాంత్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కమీషనర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ఆహార ధాన్యం వరితో పాటు.. పోషక విలువలు సమృద్ధిగా ఉన్న చిరుధాన్యాలను విస్తారంగా సాగులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ దేశంలో చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని విస్తృతంగా పెంచే చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే 2023 సంవత్సరాన్ని "చిరుధాన్యాల సంవత్సరం"గా ప్రకటించిందన్నారు. అదే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ధాన్యం వరితో పాటు వరి, జొన్న వంటి చిరుధాన్యాలను రాష్ట్రంలో విస్తారంగా సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. చిరుధాన్యాలకు కూడా భారీ స్థాయిలో కొనుగోళ్ళు పెంచి... ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మన రాష్టంలోనే.. రేషన్ కార్డు దారులకు అందజేసేందుకు దృష్టి సారిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో ఆరుతడి పంటగా అధిక మొత్తంలో.. చిరుధాన్యాలను పండించడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం సాగులో ఉండి దిగుబడులు అందుకోనున్న వైఎస్ఆర్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల జేసీలు, సివిల్ సప్లై, మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ఆయా జిల్లాల్లో పండిన రాగి, జొన్న చిరుధాన్యాల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అనుకూలతలపై చర్చించడం జరిగిందన్నారు. ప్రతి రేషన్ కార్డుకు 1 లేదా 2 కిలోల చిరుధాన్యాలను బియ్యంకు బదులుగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఆరోగ్యకరమైన, పోషక విలువలున్న చిరుధాన్యాల వాడకం ద్వారా.. రాష్ట్రంలో మెరుగైన వైవిధ్యభరితమైన ఆహార అలవాటుకు నాంది పలకడం కోసం ప్రభుత్వం ప్రజలను ప్రోత్సహిస్తోందన్నారు. చిరుధాన్యాలను సాగు చేసిన రైతులు తమ ధాన్యాన్ని మిల్లర్లకు అందజేయవలసిన అవసరం లేదని, ఆర్.బి.కెల ద్వారానే కొనుగోలు చేసి వెంటనే నగదు కూడా జమచేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేసారు. పౌరసరఫరాల శాఖ విసి, ఎండి జి. వీరపాండ్యన్ మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా రైతుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అలాగే ఎం.డి.యు. ద్వారా.. ఇంటింటికీ రేషన్ బియ్యాన్ని సరఫరా చేసే పౌర సరఫరాల వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సివిల్ సప్లై వ్యవస్థ ద్వారా రైతులు సాగు చేసిన చిరుధాన్యాలను లాభదాయకమైన ప్రభుత్వ మద్దతు ధరతో ఆర్బికేల లోనే కొనుగోలు చేస్తున్నట్లు, కొనుగోలు చేసిన వెంటనే రైతులకు పేమెంట్స్ కూడా అందజేస్తున్నట్లు రైతులకు.. తెలియజేయాలన్నారు. ఏ జిల్లాల్లో ఏ పంటకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను సాగు చేయగలమో.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించాలన్నారు. ఎఫ్.పి.ఓ.ల ద్వారా.. రైతు సంఘాలను ప్రోత్సహించి రానున్న సీజన్లలో సాగుబడి పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పి.డి.ఎస్ బాగా అమలవుతున్నప్పటికీ, మరింత మెరుగైన సేవలు అందించాలని, రేషన్ కార్డుల్లో సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలని ఆయన సూచిం చారు. కార్యక్రమంలో ముందుగా అన్ని జిల్లాల జేసీలు.. ఆయా జిల్లాలో చిరుధాన్యాల సాగు పరిస్థితిపై కమీషనర్ కు వివరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు, పౌర సరఫరాల అధికారులు, వై ఎస్ ఆర్ జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జునరావు, పౌర సరఫరాల ఉపతహశీల్దారులు, మండలస్థాయి స్టాక్ పాయింట్ ఇన్ ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే వైఎస్సార్ పార్టీ ధ్యేయం

### పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు

పీలేరు, ఫిబ్రవరి20

ప్రభాతవార్త:



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజా సంక్షేమం కోసం అన్ని విధాల కషిచేస్తున్న ఏకైక పార్టీ వైసీపీ అని పీలేరు నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, పీలేరు శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డిలు అన్నారు సోమవారం పీలేరు ఎంఎం ఫంక్షన్ హాలులో వైఎస్సార్ పార్టీ నాయకులు గహసారధులు అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమై అనంతరం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పార్టీ ప్రజల కోసం అన్ని రకాల అభివద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశాలు నిర్వహించడమే కాకుండా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు కావలసిన అవసరాలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తున్నామని అదే విధంగా నూతనంగా నియమించబడిన గహసారధులు ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ అభివద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ అందని గహాలను గుర్తించి వారికి కావలసినవి గుర్తించడంతో పాటు అధికారుల దష్టికి నాయకుల దష్టికి తీసుకుని ముందుకు వెళ్లాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు గహసారధులతో పాటు వాలంటీర్లు కూడా కషిచేయాలని ఆయన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకు సహదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించడం జరుగుతుందని ఆయన పర్యటనకు ముందే పీలేరు నియోజకవర్గంలో జరిగిన అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడం మన బాధ్యత అని ప్రజా సౌకర్యాల కోసం కావలసిన సమస్యలను గుర్తించి లిఖితపూర్వకంగా శాసన సభ్యులు దష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాథరెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి,సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా, కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, స్టాంపుల మస్తాన్, మహితాఆనంద్, ఆనంద్, సంజీవయ్య, తదితర వైకాపా నాయకులు గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.


## లక్కిరెడ్డిపల్లెలో వ్యక్తి దారుణ హత్య IVలో

## ద్విచక్రవాహనాలు ఢీ- వ్యక్తి మృతి IIIలో







## జాతర ఏర్పాట్లు సర్వం సిద్ధం

### - అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే, కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:



మండలంలోని అనంతపురం గ్రామంలో వెల సిన గంగమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు అన్నీ సర్వం సిద్ధంగా చేశారు. నేటి నుంచి 2 రోజులు పాటు జాతర అత్యంత వైభవంగా జరుగుతుంది. జాతర లోకి దూర ప్రాంతాల వారు ఇప్పటికే చేరుకున్నారు. భక్తుల కోసం వీవీఐపీల ప్రత్యేక క్యూలైన్లు, సాధారణ దర్శన క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణమంతా రంగుల రాట్నాలు, బెల్లపు చెరుకులు, మట్టి కుండలు చిరు వ్యాపారస్థులు జాతరకు చేరుకున్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి రవీంద్రరాజు ఏర్పాటు చేశారు. ఆలయం ప్రాంగణం రాజ గోపురం, విద్యుత్తు అలంకరణతో అమ్మవారి అలంకరణ ఏర్పాటు చేశారు. ఇప్పటికే జాతరకు సగం మంది భక్తులు చేరుకున్నారు. అర్ధరాత్రి నుంచి గంగమ్మ జాతర ప్రారంభమవుతుంది. తెల్లవారి ఏడుగంటల లోపు చాగల గుట్టపల్లి గంగమ్మ జాతరకు చేరుకుంటుంది. ఇప్పటికే గొల్లపల్లి గంగమ్మ జాతర కు చేరుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు, అధి కారులు సర్వం సిద్ధం చేశారు.

## శాసనమండలి ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో బిసిలకే అధిక ప్రాధాన్యత

### -అన్ని వర్గాలకు పదవుల ప్రాధాన్యతలో సిఎం జగన్ నిర్ణయం చారిత్రాత్మకం -ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్.ఫిబ్రవరి20 ప్రభాతవార్త



వైఎస్సార్‌సిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని సామాజిక వర్గాలక న్యాయం చేయడంలో దేశంలోనే నంబర్ వన్ సిఎం జగన్ అని వైఎస్సార్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అద్యక్షుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాలలో బిసిలకు పాలక వర్గాలలోను కార్పోరేషన్ పదవుల లోను, 53 కార్పోరేషన్‌లలోను అన్నింటిలో 50శాతం బీసీలకు ఉండాలని చెప్పి చట్టం తీసుకురావడంలో కానీ తర్వాత రాజ్యసభ సభ్యులలో కూడా బిసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి క్రిష్ణయ్య లాంటి వ్యక్తిని రాజ్యసభకు పంపడం సిఎం జగన్‌కే చెల్లిందన్నారు. అలాగే మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాస్‌చంద్రబోష్ ఇలా ఆరుగురిని రాజ్యసభలో బిసిలకు ప్రాధాన్యత ఇవ్వడం గతంలో ఎప్పుడు జరగలేదన్నారు. ఈరోజు శాసన మండలి ఎన్నికలలో 68.5 శాతం బిసిలకు ఇవ్వడం అన్నది చారిత్రాత్మకమన్నారు. కాబినేట్‌లోని బిసిల కు అత్యంత ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి అదే రకంగా ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 11 మంది బిసీలు, 2 ఎస్సీలు, 1 ఎస్టీలకు ఇవ్వడంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కీలకంగా పోషించారో తెలుస్తోంది. ఈ విధంగా చారిత్రా త్మకంగా ఇచ్చిన మాట ప్రకారం మాటలు చెప్పడమే కాకుం డా చేతల్లో చూపించిన వ్యక్తి సీఎం జగన్ అని తెలిపారు. విమర్శలకు తావివ్వకుండా అట్టడుగు వర్గాల నుంచి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తుండటం సంతోషదాయక మన్నారు. ఇంకా కొన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

## గోల్డన్‌యారో అవార్డు ర్యాలీలో విద్యార్థులు

**కురబలకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**




గోల్డన్‌యారో అవార్డు ర్యాలీల్లో అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు. హరియానా రాష్ట్రంలోని గద్బూరీ పాల్వాల్ జిల్లాలో సోమవారం జరిగిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ నేషనల్ యూత్ అడ్వంజర్ కార్యాలయంలో జరిగిన గోల్డన్‌యారో అవార్డు ర్యాలీలో అన్నమయ్య జిల్లాకు చెందిన విద్యార్థులు కార్తీక్, చరితారెడ్డి, భువనేశ్వర్‌కుమార్‌రెడ్డి. నవీన్ కుమార్,శ్రీనివాసులు, అభిషేక్‌లు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, చంద్రశేఖర్, రవీంద్రారెడ్డిలు పాల్గొ న్నారు. అన్యమయ్య జిల్లా టిఈఓ రాఘవరెడ్డి,స్కౌట్ అధికారి నరసింహారెడ్డి, కురబలకోట ఎంఈఓ ద్వారకనాథ్‌రెడ్డిల సహాయ సహకారాలతో పాల్గొన్నారు. ఈ విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాద్యాయులు అభినందించారు.

## యూరప్ బ్రాన్ యూనివర్శిటితో మిట్స్ ఒప్పందం

**కురబలకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



మిట్స్ కళాశాల యూరప్‌లోనే బ్రాన్ యూనివర్శిటి ఆఫ్ టెక్నాలజీ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొందని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువ రాజ్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఆ యూనివర్శిటి ప్రొపెసర్లు మిట్స్ కళాశాలను సందర్శించారు. యూనివర్శిటికి చెందిన ప్రొపెసర్లు డాక్టర్ గిరీహజ్, డాక్టర్ పావెల్‌స్టీపెన్‌లు సందర్శించి కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ, ల్యాబులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడతూ ఎలక్ట్రా నిక్స్ రంగంలో రోజు రోజుకు నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని అద్యాపకులు వాటి గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. నూతన పరిశోదనలపై కళాశాల అద్యాపకులు, విద్యార్థులతో కలసి చర్చిస్తామన్నారు. విద్యార్థులకు ఉన్న త విద్య అభ్యసించేందుకు తమ యూనివర్శిటితో కలసి పనిచేస్తామని వారు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నూతన టెక్నాలజీలపై పరిశోదనలు విస్తృతంగా జరుగుతున్నాయని విద్యార్థులు వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మూడు రోజులు పాటు వారు విద్యాపరమైన సహకారాలు విద్యార్థుల ఎక్చ్సేంచ్ ప్రోగ్రామ్, భవిష్యత్తులో మరిన్ని కార్యకలాపాలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఇంటర్‌నేషనల్ ప్రొపెసర్ శ్రీమంతుబసు, చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఈశ్వర్, కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## అంబరాన్ని తాకిన అవని జాతర

**రామసముద్రం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



రామసముద్రంకు సమీపాన కర్నాటక రాష్ట్రంలో ఉన్న అవణి జాతరకు సోమవారం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి పండగను పురష్కరించుకొని అవనిలో అత్యంత వైభవంగా స్వామివారికి పూజలు నిర్వహించి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా భక్తులు రథోత్సవంను సుందరంగా పూలతో అలకంరించిన అవని రాజు క్షత్రియ వంశస్తులు, గ్రామ పెద్దలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కల్లుపల్లి ప్రకాష్ సుమారు రెండు లక్షల మంది భక్తులకు అన్నదానం నిర్వహించడం జరిగింది. కోలాటాలు, భళ్ళారిడ్రమ్స్, సపంగీత వాయిద్యాలతో రతోత్సవం కదిలింది. భక్తులు మొక్కలు తీర్చుకొన్నారు. ఈ రథోత్సవంలో భక్తాదులు ఇసుకవేస్తే రాలని విధంగా భక్తులు,స్థానికులు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అవని మాజీ ఛైర్మెన్ విజయకుమార్, భూపతిరాజు, రవి, నవీన్, రామసముద్రం సింగిల్‌విండో ఛైర్మెన్ కేశవరెడ్డి, వైసిపి నాయకులు నందకిషోర్, రాధాక్రిష్టారెడ్డి, అర్చకులు లోకనాధంస్వామి, రమణప్పస్వామి, సునీల్, అర్చకులు నడింపల్లె పంచాయితీ లోని వాలీశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఎస్ఐ రవీంద్రబాబు పోలీస్ సిబ్బంది పకడ్బంది కార్యక్రమాలు చేపట్టారు.

## మాజీ సర్పంచ్ శ్రీనివాసులు మృతి

**రామసముద్రం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ నగిరిమడుగు శ్రీనివాసులు (45) సోమవారం మృతి చెందారు. ఇతనికి గత కొన్నేళ్ళుగా మూతపిండాల వ్యాధితో భాదపడు తుండేవాడు. ఈ నేపత్యంలో సోమవారం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడి చారు. 2010నుంచి 2015వరకు సర్పంచ్‌గా, జర్నలిస్టుగా పని చేశారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## అనుమానాస్పద రీతిలో యువకుడు మృతి

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**

అన్నమయ్యజిల్లా నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయితీ గుండ్ల బురుజు హరిజన వాడ నివాసి మల్లికార్జున(44) అనే అతను గ్రామసమీపంలో పొలాల్లో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాతిమాభీ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మృతిపై గ్రామంలో విభిన్న కథనాలు వినపడుతున్నాయి.

## డిప్యూటీ సీఎంకు క్షమాపణ

**కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



నగరంలోని రకీబ్ షా వలీ దర్గా స్థల వివాద విషయంలో మత గురువులను అరెస్టు చేస్తున్నారన్న ఆవేదనతోనే డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాను కించ పరిచే విదంగా మాట్లాడాల్సి వచ్చింది. అందుకు ఆయనను క్షమాపణలు కోరు తున్నట్లు ఖాజీ షేక్ మహ్మద్ ఇస్మా సాహెబ్ కోరారు. సోమవారం రవీంద్రనగర్‌లోని ఖాజీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురవుతుందని కొంత మంది తనకు చెప్పడంతో దర్గా వద్దకు వెళ్లానని తెలిపారు. అక్కడ మత గురువులను అరెస్టు చేయడానికి తట్టుకోలేక ఆందోళనతో అవగాహన లేక డిప్యూటీ సీఎం గురించి బాధ్యతారాహిత్యంగా మాట్లాడానని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటానని పేర్కొన్నారు. సమావేశంలో హాఫీజ్ పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధే లక్ష్యం : సర్పంచ్

**పోరుమామిళ్ల రూరల్ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



పోరుమామిళ్ల మేజర్ పంచా యతీ పరిధిలోని శివాలయం దగ్గర నుండి కొలిమి దర్గా వరకు రెండు నెలలుగా డ్రైనేజీ మరమ్మత్తుల నేపథ్యం లో పైపులు పగిలిపోవడంతో ప్రజలకు నీటి సౌకర్యం నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రజల ఇబ్బందులను గుర్తించి నూతన పైప్ లైన్‌కు శ్రీకారం చుట్టారు. ఆయన సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉండి మరమ్మత్తు పనులను పర్యవేక్షిస్తూ సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో ప్రజా సమస్యలు ఎటువంటి ఉన్న మా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారానికి శ్రీకారం చుడతామని వారు హామీ ఇచ్చారు.

## భూ కబ్జాలపై తహశీల్దార్‌పై వినతిపత్రం

**ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లెలోని పలు పంచాయతీల్లో భూ కబ్జాదారులకు అండగా నిలిచే రాజకీయ పార్టీలు, అధికారులపైన నిరసనలు వ్యక్తం చేస్తూ సోమవారం మండల వ్యవసాయ కార్మిక నాయకులు మినుకు లక్ష్మీదేవి, బి.కె.ఎం.యు. రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షులు చెన్నయ్య అధ్యక్షతన తహసీల్దార్ పీర్‌మున్నీకి భూ కబ్జాలపైన వినతిపత్రం అందజేశారు. అర్హులైన నిరుపేదలకు భూ కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకొని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు పంపిణీ చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో పండుగోళ్ల మణి, శంకరయ్య, వెంకట సుబ్బయ్య, శివ పాల్గొన్నారు.

## ఆటో ఢీ కొని స్కూటరిస్టుకు తీవ్రగాయాలు

**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**

ఆటో ఢీ కొన్న ఘటనలో ఓ స్కూటరిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. తంబళ్లపల్లె మండలం రేణిమాకులపల్లె పంచాయితీ చెరువుకిందపల్లెకు చెందిన పూజారి రామనాథ్(45) గొర్రెలు మేపుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కలకడ మండలంలోని ఝరికోనలో జరుగుతున్న శ్రీసిద్దేశరస్వామి తిరుణాలకు ద్విచక్ర వాహనంలో వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో మార్గమద్యంలో ఆటో ఢీ కొని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు గమనించి బాధితున్ని 108వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్తితి విషమంగా మారడంతో స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

## సీసీ రోడ్డు పనులు పరిశీలించిన అలీఅక్బర్

**కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



సేవే మార్గంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్న అలీ అక్బర్ 34వ డివిజన్ పరిధిలోని ఎప్పటి నుంచో నిర్మాణానికి నోచుకోని రోడ్డు పనులను స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అలీ అక్బర్ రోడ్డు పనులు చేపట్టడంతో ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. ఆయన సేవలను కొనియాడారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన అధికారులు

**దువ్వూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య సంబంధిత అధికారి డా.కిరణ్‌నాయక్, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి డా.మల్లేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి, మురళీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా మండల పరిధిలో ఉన్న గర్భిణీలకు ఉన్న రక్తహీనత, రక్తశాతం అంచనా గురించి పరిశీలన చేశారు. గర్భవతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రక్త శాతం ఏఎన్ఎంలు పరిశీలించిన రక్తశాతం, ఆరోగ్య కేంద్రంలో రక్త శాతం మూడు పరిక్షల నమూనాలను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా గర్భిణీలకు రక్త హీనత ఎక్కువ శాతం నమోదు అవుతున్నందున కాన్పు సమయంలో సమస్యలు వస్తున్నాయని అందువల్ల కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్య క్రమం ఎనిర్వహించడం జరుగుతోందన్నారు. నరపతి సచివాలయం నుంచి 5 మందికి అన్ని రకాల రక్త పరీక్షలు న్విహించడం జరుగుతుందన్నారు. గర్భవతులు రక్త పరీక్షలు చేయించుకొని వాటికి సంబంధించిన మందులు, పౌష్టికాహారం తీసుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధి కారి సమీరా, ఆరోగ్య విస్తరణాధికారి శివరామయ్య, సిబ్బంది మేరీ సువర్ణ, మునిస్వామి, హారతి పాల్గొన్నారు.

## వేసవిలో మంచి నీటి సమస్య లేకుండా చూడాలి

**దువ్వూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



ప్రస్తుతం వేసవి కాలం వచ్చిందని అందువల్ల 23 గ్రామ పంచాయతీల్లో ఎక్కడా మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు కానాల జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొని వారి శాఖలోని అభివృద్ధిని వివరించారు. ఎంఈవో శివజ్యోతి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను మంచిగా చదివించి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మార్చి 2నుంచి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సీఎం ఆదేశాల మేరకు రాగి జావ అందిస్తున్నామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి మాట్లాడుతూ మండలంలో అక్కడక్కడ కిందికి వేలాడే తీగలు సరిచేశామని ఏమైనా సమస్య లుంటే తమ దృష్టికి తేవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లకు మీటర్లు, వైర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. హౌసింగ్ ఏఈ బాషా మాట్లాడుతూ మండలంలో ఇంత వరకు లబ్ధిదారులకు రూ.3.50కోట్లు చెల్లించామని వంద గృహాలు పూర్తయ్యాయని 210 గృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం మండలంలో 108 గృహాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఉపాధి హామీ ఏపీవో మాట్లాడుతూ జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని బ్యాంకు ఖాతాకు అనుసంధానం అయి ఉండాలన్నారు. రోజూ కూలీలకు 2సార్లు హాజరు, ముఖ హాజరు కూడా ఉంటుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ అభివృద్ధిని గురించి వివరించారు. ఎంపీపీ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ సభ్యులు ప్రతిపాదించిన సమస్యలను అధికారులు స్పందించి పరిష్కరించా లన్నారు. నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అందుకు ఎమ్మెల్యే సహకారంతో నిధులు కేటాయిస్తామన్నారు. సమావేశంలో ఏవో నాగేంద్ర బాబు, మండల శాఖాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సి.బయనపల్లెలో చోరీ

**దువ్వూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సి.బయనపల్లె గ్రామంలో కత్తి వెంకటేశ్వర్లు ఇంట్లో రూ.1.85లక్షలు బంగారు, వెండి, నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాఘవేంద్రరెడ్డి తెలిపారు. కత్తి వెంకటేశ్వర్లు శివరాత్రి సందర్భంగా వివిధ క్షేత్రాలకు వెళ్లి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా వాకిలి పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాను కూడా పగలగొట్టి అందులోని రూ.లక్ష మేర బంగారు, వెండి వస్తువులు, రూ.80వేలు నగదును చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పాఠశాలల మూసివేత సరికాదు : యూటిఎఫ్, ఎస్టియు

**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



పది మంది మంది లోపు పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనలు విద్యావ్యవస్థకు తీరని నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జయరామయ్యలు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం బి.కోడూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలలు కనుమరుగయి బడుగు, బలహీన, అణగారిన పేద వర్గాల వారికి విద్య దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ నియామకపు డీఎస్సీని ప్రకటించి కొత్త ఉపాధ్యాయ నియమాకాలు చేపట్టి విద్యా వ్యవస్థను బలోపేతం చేసి పేదలకు విద్యను మరింత చేరువ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి కావస్తున్న ఉపా ధ్యాయ, ఉద్యోగ, కార్మికులకు ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం చేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు, యుటీఎఫ్ నాయకులు బాల రాజు, చంద్రశేఖర్,రామచంద్రారెడ్డి, రమణమూర్తి, పుల్లయ్య,రాజగోపాల్ రెడ్డి,కుమార్ బాబు,పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## స్పందనను సద్వినియోగపరచు కోవాలి

**గోపవరం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త;**



స్పందనా కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగపరచు కోవాలని తాహశీల్దారు దామోదర్‌రెడ్డి ఎంఎస్ఓ డాక్టర్ నాగరాజులు సంయుక్తంగా పేర్కొన్నారు. స్దానిక తాహశీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందనా కార్య క్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ యా గ్రామ విఆర్ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాలలో ఏవైనా సమస్య లు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరారు.అదే విదంగా అన్ని శాఖల అధికారులు స్పందనా కార్యక్రమంలో అందుబాటులో ఉంటా రన్నారు. వ్యయ ప్రయాసలతోర్చి జిల్లా కేద్రానికి వెల్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి సమస్యనూ స్దానిక తాహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగే స్పందనా కార్యక్రమంలో పరిస్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ చిట్టిబాబు,ఎంపిడిఓ హరినారాయణ,ఏఓ అరవిందనాయక్,ఎంఈఓ చెన్నయ్య, ఏపిఓ జయచంద్ర, ఏపిఎం శివప్రసాద్, పసువైద్యాదికారి కృష్ణవేణి, ఈఓ పిఆర్‌డి హసీనా పాల్గొన్నారు.

## పంట నమోదుకు నేడే చివరి అవకాశం

### ఏఓ అరవింద నాయక్

**గోపవరం,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త;**



పంట నమోదు చేసుకొనేందుకు నేడే చివరి అవకాశం అని మండల వ్యవ సాయాదికారి అరవింద నాయక్ అన్నారు. రైతు భరోసా కేద్రంలో సోమవారం ఆయ న విలేఖరులతో మాట్లాడుతూ మండల రైతులు రబి సాగుకు సంబందించిన పూర్తి వివరాలను ఈక్రాప్ బుకింగ్ ద్వారా మంగ్లవారం సాయంత్రానికల్లా నమోదు చేయించుకోవాలన్నారు. ఆయా గ్రామాల రైతు భరోసా కేద్రాలల్లో పంట సాగును నమోదు చేయించుకోవాలని తెలిపారు. గోపవరం, బేతాయిపల్లెల రైతు భరోసా కేంద్రాల ఫోన్ నెంబర్ల ద్వారా కూడా రైతులు పైర్ల నమోదు చేయించు కోవచ్చునని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియో గించుకోవాలన్నారు.

## ప్రజా ఉద్యమాలను బలపరచండి : డివైఎఫ్ఐ

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



ప్రజా ఉద్యమాలను ఆదరించి బలపరచాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాస్ క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం జరిగే ప్రజా ఉద్యమాలను బలపరచాలని, రైతులు, కార్మిక, వ్యవసాయ కార్మిక, మహిళ, దళిత, బలహీన వర్గాల యువత, విద్యార్థి వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. సీపీఎం చేసే ఉద్యమాలను ఆదరించి బలపరవలసినదిగా ప్రజలకు విన్నవిస్తున్నామన్నారు. ప్రజలు ఇచ్చే ప్రతి రూపాయి ప్రజా ఉద్యమానికి ఖర్చు చేసి మీ డబ్బుకు మరింత గౌరవం పెంచుతున్నామని వినయ పూర్వకంగా మీ సహాయాన్ని అర్థిస్తున్నామని కోరారు. కార్యక్రమంలో డివైఎఫఐ నాయకులు ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, ప్రసాద్, వృత్తిదారుల సంఘం నాయకులు పొంగూరు నాగరాజు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన బిల్ కలెక్టర్ సూహెల్

**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



బ్రహ్మంగారి మఠం మండలం జోకు పల్లె గ్రామానికి చెందిన ఎర్రంపల్లె మరియమ్మ ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు హిప్టోపిక్ ప్రెగ్నెన్సీ (ప్రెగ్నెన్సీ ఫెయిల్ ) కావడంతో అత్యవసరంగా హాస్పిటల్లో చేరగా హాస్పిటల్ వైద్య సిబ్బంది బి పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలుపగా పేషెంట్ తాలూకా బంధుమిత్రులు రక్తం కోసం ప్రయత్నం చేయగా చివరి క్షణాల్లో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ ని సంప్రదించగా స్పందించిన రసూల్ పోరుమామిళ్లకు చెందిన షేక్ సుహేల్ చే రక్త దానం చేపించారు. ఈ సందర్భంగా సంస్థ పౌండర్ ప్రసాద్ , రసూల్‌లు అడిగిన వెంటనే చదువుకుంటూ పార్ట్ టైం జాబ్‌గా కరెంట్ బిల్ కలెక్టర్ సుహేల్ ను అభినందించారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ పురం ప్రసాద్ ట్రస్ట్ సభ్యుడు అఖిల్, విజయ్, హృదయనాద్ , రాజ శేఖర్ పాల్గొన్నారు.

## ఇ-పంట నమోదుకు చివరి అవకాశం

### - ఎంఏవో చంద్రమోహన్ రెడ్డి

**బద్వేలు రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



రబీ సీజన్‌లో మండల పరిధిలో పంటలు వేసిన రైతులు వ్యవసాయ, ఉద్యాన పంటలను ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేసుకొనుటకు త్వరలో గడువు ముగియనున్నదని ఎంఎవో చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. రైతులు తాము సాగు చేసిన పంటలను మీ సమీపంలోని గ్రామ రైతు భరోసా కేంద్రం నందు ఉన్న సహాయకుల ద్వారా ఇ-క్రాప్ యాప్ నందు పంట నమోదు చేసుకోవలసినదిగా తెలియజేశారు. ఈ యాప్‌లో నమోదు చేసుకున్న పంటల ఆధారంగా రాబోవు రోజులలో వివిధ రకాల పథకాలైనటువంటి కనీస మద్దతు ధర, జరిగే పంట కొనుగోలు, డ్రిప్‌లు, స్పిన క్లర్లు, ఇన్పుట్ సబ్సిడీ ఇతర పథకాలకు అర్హులు కాగలరని, కావున ప్రతి ఒక్క రైతు పంట నమోదు చేసుకోవలసినదిగా తెలియజేయడం జరిగింది. ఇందుకు సమాచారం కొరకు చెన్నంపల్లె రైతు భరోసా కేంద్రం 8008006758, 9390917327, బద్వేలు, గుంతపల్లె రైతు భరోసా కేంద్రం 9392707274, మండల వ్యవసాయ అధికారి 8331057375 నెంబర్లకు ఫోన్ చేసి పంట నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇంటి వద్దకే వైద్య సేవలు

**కాశినాయన, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



మండల పరిధిలోని నరసన్నపల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 67 మంది వైద్య సేవలందించి, వారికి అవసరమైన మందులు అందించారు. 5 మంది గర్భిణీ స్త్రీలకు, 7 మంది బాలిం తలకు, నలుగురు చిన్న పిల్లలకు రక్త పరీక్షలు చేసి, రక్త హీనత ఉన్న గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఐరన్, క్యాల్షియం మాత్రలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రక్త హీనత ఉన్న చిన్న పిల్లలకు ఐరన్ సిరప్ అందించారు. షుగర్, బీపి, గ్యాస్ట్రిక్ ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కాన్సెప్ట్‌లో 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఈ కాన్సెప్ట్ కార్యక్రమంలో పాల్గొని వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రశాంతి ప్రజలకు తెలియజేశారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన వారి వివరాలు నమోదు చేయాలని సచివాలయం ఏఎన్ఎం హరిత తెలిపారు. తద్వారా వారికి చికిత్సలు వారి ఇంటి వద్దనే అందించడానికి సులువుగా ఉంటుందని డా॥ ప్రశాంతి పేర్కొన్నారు. నరసన్నపల్లె, పిట్టిగుంట గ్రామాలలో వైద్య సేవలందించి, జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు, అలెర్జీ ఉన్నవారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో అబ్జర్వర్ చంద్రశేఖర్, సిహెచ్‌వో శ్రీనాథ్, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులురెడ్డి, సుబ్బరాయుడు, పర్యవేక్షకులు బాలయ్య, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

**వేంపల్లె, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**



ఎమ్మెల్సీ పదవుల్లో గుంటూరుకు చెందిన ఏసురత్నంకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వేంపల్లె వడియరాజుల సంఘం అధ్యక్షుడు మల్లె సంటెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన వేంపల్లెలో విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తూ వడియరాజుల కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అలాగే ఛైర్మన్, డైరెక్టర్ల పదవులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. ఎల్లవేళలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వడియరాజులందరు అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్సీ పదవుల్లో తమ కులానికి సంబంధించిన వ్యక్తికి కేటాయించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో వడియరాజులసంఘం నేతలు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన ఎంపీ

**పులివెందుల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**



పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి భౌతిక కాయానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం నివాళులర్పించారు. పులివెందుల మండలం తుమ్మలపల్లెలో నిర్వహించిన సిరిమాను గ్రామోత్సవంలో జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి బండి చక్రాల కింద పడి ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ హైదరాబాదు నుండి బయల్దేరి నేరుగా గ్రామానికి వెళ్లి మహేశ్వరరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ జడ్పీటీసీ మహేశ్వరరెడ్డిని కోల్పోవడం బాధాకరం అన్నారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తామని, అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులను ఎంపీ ఓదార్చారు.

## బీసీల పక్షపాతి వైకాపా ప్రభుత్వం

**పులివెందుల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**



వైకాపా ప్రభుత్వం బీసీల పక్షపాతి అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు 11 సీట్లు ఇచ్చి మరోసారి ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరూపించారని పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అన్నారు. సోమవారం పులివెందులలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. మొత్తం 18 స్థానాల్లో స్థానిక సంస్థల కోటా కింద 9, ఎమ్మెల్యే కోటా కింద 7, గవర్నర్ కోటా కింద 2మొత్తం 18 స్థానాల్లో 11 స్థానాలు బీసీలకు కేటాయించి వైకాపా ప్రభుత్వం బీసీల ప్రభుత్వం అని నిరూపించుకున్నారన్నారు వైకాపా ప్రభుత్వంలో బీసీలకు ప్రతి విషయంలోను న్యాయం జరుగుతూనే ఉందన్నారు. గతంలో బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత కూడా సీఎం జగన్‌దే అన్నారు. బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు మూడు రాజ్యసభ సీట్లు ఇచ్చిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మాట తప్పని, మడమతిప్పని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు.

## లోక కళ్యాణం కోసం చండీహోమం

**రాయచోటి టౌన్ .ఫిబ్రవరి20 ప్రభాతవార్త**



రాయచోటిలో వెలసిన వీరభద్రుని బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం లోక కళ్యాణం కోసం చండీ హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయిన రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ఆలయ కమిటి చైర్మన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఈవో రమణారెడ్డిలు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కర్నూలు జిల్లా నంద్యాల నందుల మఠంనకు చెందిన వేద పండితులు శశిభూషణ సిద్దాంతి బృందం వేద మంత్రోచ్చరణలతో హోమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకాం త్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయ పూజారులు శ్రీకాంత్‌రెడ్డికి తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ గిరీష, సతీమణ స్నేహశ్రీ, జిల్లా దేవాదాయశాఖాధికారి విశ్వనాథ్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేష్, రామాపురం జెడ్‌పిటిసి మాసన వెంకటరమణ, సుగవాసి శ్యామ్, సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అవినీతి, అరాచకపాలన నడుస్తోంది

### మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

**రాయచోటి .ఫిబ్రవరి20 ప్రభాతవార్త**



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, అరాచక పాలన సాగుతోందని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాయచోటి మండలం పెమ్మాడపల్లి పంచాయతీ గరుగుపల్లిలో టిడిపి ఆద్వర్యంలో రాష్టానికి ఇదేమి కర్మ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్డు సక్రమంగా లేవని, డ్రైనేజీలు లేవని, ఎక్కడ చెత్త అక్కడే ఉందని దాని వల్ల ప్రజలు జ్వరాలు బారిన పడే అవకాశాలున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో పేద ప్రజలు సుఖంగా జీవించాలనే లక్ష్యంతో అహర్నిషలు కష్టపడుతూ సరుకులు ధరలు పెంచకుండా, బ్లాక్ మార్కెట్ తరలించకుండా కట్టడి చేశారన్నారు. కార్యక్రమంలో మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ పల్లపు వాసు, మాజీ జెడ్‌పిటిసి రామ చంద్ర, మాజీ సర ్పంచ్‌లు వాసు, బసయ్య, నాగేశ్వర కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరణించిన పోలీస్ కుటుంబానికి ఆర్థిక సాయం

**రాయచోటి .ఫిబ్రవరి20 ప్రభాతవార్త**



ఇటీవల అనారోగ్యంతో మరణించిన జి.సుబ్బరాయుడు కుటుంబానికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో సోమావారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. పోలీస్ వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం అందజేశారు. జి.సుబ్బరాయుడు సతీమణి జి.సుభాషినికి జిల్లా ఎస్పీ ఆర్థిక సాయం అందజేశారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఆలయానికి నగదు వితరణ

**సంబేపల్లి .ఫిబ్రవరి20 ప్రభాతవార్త**



సంబేపల్లి మండలం నల్ల గంగమ్మ దేవస్థానానికి లయన్స్ క్లబ్ ఆప్ రాయచోటి వారి ఆద్వర్యంలో వాటర్ పైప్ లైన్ కొరకు డా.శ్యామ్ సుందర్‌రెడ్డి, డా.రెడ్డికీర్తిల సౌజన్యంతో రూ.9700లను ఆలయంకు సోమవారం విరాళంగా ఇచ్చారు. అనంతరం లయన్ డా.శ్యామ్ సుందర్‌రెడ్డి మాట్లా డుతూ పర్యావరణ సంరక్షణకై తమ వంతు కృషిగా ఈ విరాళాన్ని ఆల యానికి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిస్యత్తులో పర్యావరణానికి సంబందించి ఇలాంటి కార్యక్రమాలు తరచూ చేస్తుంటామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ హరీష్, సభ్యులు లయన్ ప్రసాద్, అశోక్‌రెడ్డి, ఆలయ మెంబర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## అవసరాలు గుర్తించి పాలన సాగిస్తున్న జగన్

**వాల్మీకిపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రజల రుణం తీర్చు కునేందుకు ఎంతో బాధ్యతతో కూడిన పాలనను సీఎం జగన్ మోహన్‌రెడ్డి అంది స్తున్నారని స్థానిక ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కేఎస్‌ఆర్ కళ్యాణమండపంలో మండల వ్యాప్తంగా ఉన్న 530 మంది గృహ సారధులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. సదస్సును ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయ వ్యవస్థ, నాడు-నేడు అభివద్ధి కార్య క్రమాలతో పాటు అన్ని బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగే విధంగ నవరత్నాలు లాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అని ్న వర్గాల ప్రజలను సంతప్తి పరుస్తూ పాలనను సీఎం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివద్ధిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గహ సారధులపై ఉందన్నారు. కార్యక్రమంలో వైకాపా నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు నిర్మల, సర్పంచి గంగులమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యులు శివానందరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవినాయక్, ఉపసర్పంచి కేశవరెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ నీళ్ళ భాస్కర్, గహసారధుల మండల కన్వీనర్ రాయుడు, నాయకులు ఒరుగంటి రమేష్, లక్ష్మీ నారాయణరెడ్డి, నరసింహులు, శ్రీధర్ రాయల్, మైనారిటీ నాయ కులు ఖలీమ్, సర్పంచిలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## వైభవంగా మహా అన్నాభిషేకం

**వాల్మీకిపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



పట్టణ పడమర పొలిమేర్ల ప్రాంతం లో వెలసిన శ్రీలింగోద్భవ మహాశివుడు ఆలయంలో సోమవారం మహాశివుడికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహా అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారికి సుప్రభాతసేవతో కార్యక్ర మాలు ప్రారంభమై తదుపరి అభిషేకం, పంచామతాభిషేకం, అర్చన, తోమాల సేవ, పుష్పాలంకరణ కార ్యక్రమాలు జరిగాయి. తదుపరి వేద పండితుల మంత్రోచ్చారణల మద ్య స్వామి వారికి మహా అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్య క్రమం లో ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు బాషికాచార్యులు, అభిరాం స్వామి, రాజుస్వామి, భక్తులు ఆలయ అభివద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి జాతర

**పీలేరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



మండలంలోని ముదుపులవేములలో వైభవంగా ఓదేటి యల్లమ్మ తల్లి జాతర జరిగింది. ఆదివారం తెల్లవారి నుంచి సోమవారం ఉదయం వరకు ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర వివిధ సాంస్కతిక కార్యక్రమాలు జరిగాయి. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర హరికత కాలక్షేపం జరిగింది. రాత్రివీధినాటకం ప్రదర్శిం చబడింది. విద్యుత్ దీపాలుతో అలంకరించిన చాందిని బండ్లు ముదుపులవేముల నుంచి గుడి వరకు ఊరేగింపు జరిగింది. ఊరేగింపులో చెక్క భజనలు,కోలాటాలు వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. సోమవారం సాయంత్రం దిగువ ఎల్లంపల్లె గుడి నుంచి అమ్మవారి అత్తగారిల్లు అయిన ముదుపులవేముల పెద్దపల్లెకి ఊరేగింపు జరుగుతుంది. పూజా కార్యక్రమాలు పూజారి కష్ణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్య క్రమంలో మంచూరు రంగా రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మంచూరు గోవర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాజశేఖర్, చక్రపాణిరెడ్డి,శ్రీరాములురెడ్డి, శివ, మదన, నరసింహులు , ద్వారకనాథరెడ్డి, మల్లి కార్జున, వెంకటరెడ్డి, ముదుపులవేముల దిగువ ఎల్లంపల్లె, ముదుపుల వేముల పెద్దపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీ- వ్యక్తి మృతి

**పీలేరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమ వారం ఉదయం పట్టణ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు పీలేరులోని బాపూజీ కాలనీకి చెందిన బండి వెంక టేష్(35) కాకులారంపల్లెకు చెందిన సరస్వతి(26) సోమవారం ఉదయం తమ ద్విచక్రవాహనంలో మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ ప్రాంతం నుంచి పీలేరుకు వస్తున్నారు. అదే సమయంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భరత్(27) తన ద్విచక్రవాహనంలో మదన పల్లెకు వెళుతున్నాడు. బడబళ్లవంక వద్ద ఉన్న మలుపు వద్ద వీరి ఇద్దరి వాహనా లు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో వెంకటేశు తలకు తీవ్రగాయా లై అదిక రక్త స్రావం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సర స్వతి, భరత్‌కు గాయాలైయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరి క్షతగాత్రులను వెంటనే పీలేరు ప్రభుత్వాసుత్రికి తరలించారు. వెంకటేశు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్ప గించారు. భరత్‌కు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మండల వైఎస్సార్ ఇన్‌చార్జిగా ఆనంద్

**పీలేరు, ఫిబ్రవరి 20ప్రభాతవార్త:**



పీలేరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా మాజీ ఎంపీపీ మహిత భర్త ఆనంద్‌ను నియమించినట్లు వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ కన్వీనర్ దండు జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ పీలేరు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అన్ని విధాల ముందుకు తీసుకెళ్లేందుకు కషిచేస్తానని ముఖ్యంగా యువతను, మహిళ లను పార్టీలో చురుగ్గా పనిచేసేందుకు కషిచేయడంతో పాటు తనవంతు కర్త వ్యాన్ని నిర్వర్తిస్తానని ఆనంద్ తెలిపారు. మండలపార్టీ ఇన్‌చార్జిగా నియమించి నందుకు పీలేరు శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి,నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవి. శ్రీనాథ రెడ్డి, జడ్పీటీసీ రత ్నశేఖర్‌రెడ్డి, సర్పంచి హబీబ్‌బాషా పార్టీ నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

## సత్‌ప్రవర్తనతో బంగారు భవిష్యత్తు : డిఎస్‌పి

**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



యువత సత్‌ప్రవర్తనతోనే బంగారు భవిష్యత్తు కలుగుతుందని మదనపల్లె డిఎస్‌పి కేశప్ప తెలిపారు. సోమవారం స్థానిక జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యా ర్థులతో సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఈ సమావేశానికి హాజరైన డిఎస్‌పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాటి వల్ల జరిగే అనర్థలపై వివరిస్తూ చదువుకునే దశలో ఎలాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు కలలు కన్న బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం కష్టపడాలని సూచించారు. రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మురళీక్రిష్ణ మాట్లడుతూ మత్తు పదార్థాలు, మారకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్తాలపై క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు. తాలూకా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రుల మాట విని సత్‌ప్రవర్తనతో విద్యార్థులు మెలగాలని సూచించారు. విఎస్‌ఆర్ గ్రూప్స్ అధినేత సుధాకర్‌రెడ్డి, విద్యార్థులకు విలువైన సూచనలు తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రౌడీయిజంతో వైసిపి రాజకీయం

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



20 తేదీన గన్నవరం టీడీపీ కార్యలయంపై వల్లభనేని వంశీ అనుచర రౌడీ మూకలు దాడి చేయడం, కారు ధ్వంసం చేయడం సరైనది కాదని, 1980 నాటి అల్లర్లు గుర్తుకు వస్తున్నాయని, వైసీపీ నాయకుల కూల్చివేతలు, ఆగడాలు పరాకాష్టకు చేరాయని 2024 ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని కడప జిల్లా టిఎన్టియుసి అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్, ప్రధాన కార్యదర్శి సాయి విశ్వనాధులు సోమవారం ప్రొద్దుటూరులో మీడియా సమావేశంలో తెలిపారు.

## శ్రీకామాక్షి సాహితీ సిద్ధేశ్వరస్వామి త్రినేత్ర మహోత్సవం

**కలకడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో సోమవారం శ్రీకామాక్షి సాహితీ సిద్దేశ్వరస్వామి వారి మహోత్స వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్తలు కేసర్ల అఖిలేష్, కలకడ రామకష్ణారెడ్డి, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, గుడది, శ్రీనివాసులునాయుడు,మాట్లాడుతూ శ్రీకామాక్షి సాహితీ సిద్దేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు 12వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించబడుతాయని అన్నారు. ఇప్పటికి ఈబ్రహ్మోత్సవాలు 9వ రోజు జరిగా యని సోమవారం త్రినేత్ర దారణ మహానివేద రథోత్సవం వేణుగోపాల స్వామి ఆలయంలో తోట ఉత్సవం లాంటిదైవ కార్యక్రమాలను నిర్వహించామని అన్నా రు. శ్రీకామాక్షి సాహితీ సిద్ద ్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పురో హితులు విజయసారధిశర్మ సుబ్రమణ్యస్వామి, పడమటి గడ్డ నాయినివారు, నరసింహులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు భూములు తన హయాంలోనే కాపాడా

### మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



పట్టణంలో ఎంతో విలువైన వక్ఫ్ బోర్డు భూములను తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలోనే కాపాడడం జరిగిం దని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ముజీబ్‌హుస్సేన్ తనపై చేసిన ఆరోపణలు ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సుమారు రూ.1500 కోట్లు విలువ చేసే వక్ఫ్‌బోర్డు భూములు కాపాడి వక్స్ బోర్డుకు అప్పగించడం జరిగిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వివాదాస్పదంగా ఉన్న భూమిని సంరక్షించి అభ్రిద్ధి చేయడం జరిగిందన్నారు. మదనపల్లె అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో నియోజకవర్గంలో రూ. వెయ్యికోట్లుకుపైగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. వక్ఫ్‌బోర్డు భూభాగంలో నిరుపేదలు వేస్తుకొన్న షెడ్లను తొలగించడం అన్యాయమన్నారు. మదనపల్లెకు ఎమ్మెల్యేగా తానే కావడం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రెడ్డిసాహెబ్, నాయకులు షంషీర్, ఇంతియాజ్, వేమయ్యయాదవ్, రాజేష్, నజీర్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : ఆర్‌డిఒ

**మదనపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వ రం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన స్పందనా కార్యక్రమంలో ఆర్డీఓ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. ఈ సందర్భం గా ఆర్డీఓ మాట్లాడుతూ స్పందనలో ప్రజలు విన్నవించే ప్రజాసమస్యలను గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నవరత్న పథకాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. భూసమస్యలు, రోడ్లు, నీటి వసతిపై సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో వచ్చే సమస్యలను అక్కడి తహశీల్దార్లతోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందనా కార్రక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## శామ్యూల్ ఆనందకుమార్ పర్యటనపై ఆర్డీఓకు వినతి

**మదనపల్లె, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



శామ్యూల్ అనందకుమార్ పర్యటన లో గందరగోళం తలెత్తకుండా చూడాలని రాష్ట్ర వాల్మీకిసంఘం నాయకులు ఆర్డీఓ ఎంఎస్.మురళికి విన్నవించారు. సోమ వారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో నాయకులు పులిశ్రీనివాసులు, సద్దల జయసింహ, కొత్తూరు శంకర్, గాదె బాస్కర్, రెడ్డిశేఖర్‌లు ఆర్డీఓకు విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకుల ఎస్‌టి పునరుద్దరణపై అధ్యాయనానికి నియమించిన శామ్యూల్ ఆనందకుమార్ ఏకసభ్య కమిటీ ఇప్పటి వరకు రాష్ట్రంలో పర్యటిస్తూ ఎస్‌టి జాబితలోనే కులాలతోపాటు వాల్మీకుల అభిప్రాయాలను తీసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణంలోని ఎస్‌టి సంఘా లతో పాటు వాల్మీకులు పెద్దసంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించడా నికి అవకాశం ఉందని ఈ పరిస్తితుల్లో వివిధ వర్గాలు హాజరైతే గందరగోళం ఏర్పడుతుందని, ఆయా వర్గాల వారికి సమయం కేటాయించాలని కోరారు. కార్య క్రమంలో సోమశేఖర్, అరవ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తారకరత్నకు నివాళులు

**కురబలకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



సినీనటుడు నందమూరి తారక రత్నకు టిడిపి నాయకులు సోమవారం నివాళులర్పించారు. అంగళ్ళు బస్టాండులో తారకరత్న చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నాయకులు అందరూ నివాళులర్పించారు. ఈసందర్భంగా టిడిపి రాజంపేట పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ మాట్లాడుతూ తారకరత్న మృతితో టిడిపి, నందమూరి కుటుంబాల్లో తీవ్ర విషాధాన్ని నింపిం దన్నారు. తారకరత్న టిడిపి కార్యక్రమాల్లో పాల్గొని కార్యకర్తలను ఉత్తేజ పరిచేవారని కొనియాడారు. కార్య క్రమంలో మాజీ వైస్ ఎంపిపి వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపిటిసిలు వెంకటరెడ్డి, గడ్డం నరసింహులు, మోహన్‌రెడ్డి, అయూబ్ బాషా, బొగ్గుభాస్కర్, కేసి.రామచంద్ర, బావాజాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

**ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలంలోని చిన్నఓరంపాడు ఏపీజీబీ ఆధ్వర్యం లో సోమవారం నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపైన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బ్రాంచి మేనేజర్ రునేంద్ర మాట్లాడుతూ ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యతపైన ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు అన్ని విధాలా బ్యాంకు రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. అంతే కాకుండా పొదుపు ద్వారా ఆర్థిక లావాదేవీలలో భాగంగా బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు పొంది తిరిగి చెల్లిస్తే అందరూ సాధికారపై అవగాహన కలిగి ఉండడంతో పాటు మహిళలు ఆర్థిక శక్తిగా ఎదుగుతారన్నారు. బ్యాంకు లావా దేవీలుపై కళాకారులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్ముగం, దామోదర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్య క్షత్రియ రాష్ట్ర స్థాయి సమావేశానికి గౌస్ బాషాకు ఆహ్వానం

**కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



ఏపీ ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం వారి రాష్ట్ర స్థాయి ద్వితీయ సమా వేశానికి 33వ డివిజన్ కార్పొరేటర్ గౌస్‌బాషాను సంఘం సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా ఆహ్వాన పత్రికను ఇచ్చి ఆహ్వా నించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ స్థానిక బ్రాహ్మణవీధిలోని శ్రీ రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు పాల్గొం టారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో జరుగనున్న సమావేశంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు తప్పని సరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నరసిం హం, అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి శశివరకుమార్, ఉపాధ్యక్షులు సుబ్బారావు, సభ్యులు అమర్‌నాథ్, శశికుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన బండి సుమంత్‌కుమార్

**కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో కడప జిల్లా అధ్యక్షు డిగా బండి సుమంత్ కుమార్ గెలు పొందారు. ఈ సందర్భంగా సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రమాణ స్వీకార మహోత్స వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డా.ఎన్.తులసిరెడ్డి, పీసీసీ డెలిగేట్ బండి జకరయ్య, మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ బండి మార్తమ్మ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్ తేజ, శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ హాజ రయ్యారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి సుమంత్‌కుమార్ పూలమాల వేసి యువతతో కలిసి భారీ ర్యాలీగా బాణాసంచా పేల్చుతూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం చేరుకున్నారు. అనంతరం జిల్లా అధ్య క్షుడు నీలి శ్రీనివాస రావు అధ్యక్షతన ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉన్న అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగం ఇండియన్ యూత్ కాంగ్రెస్ లో జిల్లా అధ్యక్షుడిగా అవకాశం దక్కడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్స్ సత్తార్, ధ్రువ కుమార్‌రెడ్డి, అన్వర్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు మహబూబ్ బాషా, వంశీ యాదవ్, కొమ్మది శ్రీసాయి, టీ రాజేష్, సునీల్, రంగనాథ్, మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, చెప్పలి పుల్లయ్య, కృష్ణా రెడ్డి, ప్రసాద్‌గౌడ్, మనోహర్, బాబు, గౌరీ, గోర్ల శ్రీనివాసులు, బొజ్జా శ్రీని వాసులు, ఏసయ్య, మల్లికాబేగం, అధిక సంఖ్యలో అశోక్‌నగర్ యూత్ పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వ నమోదులో స్టేట్ టాపర్ బిట్టి ఆది

**కమలాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



తెదేపా సభ్యత్వ నమోదులో రాష్ట్రం లోనే టాపర్‌గా నిలిచిన ఐటీడీపీ బిట్టి ఆదిని సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షులు పుత్తా నరసింహారెడ్డి, యువ నాయ కులు పుత్తా చైతన్య రెడ్డి అభినందించి సన్మానించారు. తెదేపాలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు, గౌరవం ఖచ్చితంగా ఇస్తామని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఐటీడీపీ టీం సభ్యులు అందరూ కలిసి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని మంచి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కోరారు.

## బావ హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

**కమలాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



కమలాపురం మండలం రామచంద్రా పురం పూసల కాలనీకి చెందిన చాపలి రమణయ్య(27)ను సోమవారం మధ్యా హ్నం టి.చదిపిరాళ్ల బస్టాండు వద్ద కమలా పురం సీఐ సత్యబాబు, ఎస్సై చిన్న పెద్దయ్య తమ సిబ్బందితో కలిసి పంచాయతీదార్ల సమక్షంలో అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ముద్దాయి రమణయ్య ఈనెల 16వ తేదీ ఉదయం రామచంద్రాపురం పూసల కాలనీకి చెందిన మామిళ్ల బాబు(40) తన సొంత బావను సెల్ ఫోన్ విషయమై గొడవలో కట్టెతో తలపై కొట్టగా మృతి చెందాడు. అదే రోజు కేసు నమోదు చేసిన పోలీ సులు సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు.

## ఘనంగా రథోత్సవ వేడుకలు

**పెద్దతిప్ప సముద్రం ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గత మూడు రోజులుగా స్థానికంగా వెలిసిన శ్రీ పార్వతి సమేత వీరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో వివిధ హెూమాలు పూజలు నిర్వహించిన అనంతరం సోమవారం రోజున ఆల య నిర్వహకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ప్రజల తో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తుల సమాజంలో వేడుక లు ఘనంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి విచ్చేసిన భక్తులు ఆరు తులిచి టెంకాయలు కొట్టి భక్తసర్దలతో తమ ముక్కులు తీర్చుకున్నారు. గ్రామ పురవీధుల్లో శివ నామ స్వరాలతో మారు మ్రోగా యి కోలాట చెక్కభజనల ప్రదర్శనలతో బళ్లారి డ్రస్సులతో వైభవంగా రథోత్సవం వేడుకలు నిర్వహించినట్లు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**

మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమ వారం జరిగింది. చిత్తూరుజిల్లా పుంగనూరు మండలంల ఎల్లారుబైలుకు చెందిన శంకరప్ప భార్య రెడ్డమ్మ(35) వ్యవసాయ పనులు చేస్తుండేది. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఈమె ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి వార్డుకు తరలించారు. ఈ క్రమంలో పరిస్తితి విషమంగా మారడంతో మృతి చెందింది. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అఖండ మల్లేశ్వరునికి ఘనంగా పూజలు

**కురబలకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:**



మహాశివరాత్రి సందర్భంగా మండలం లోనే ప్రజలు శనివారం, ఆదివారం, సోమ వారం మూడు రోజులు శివాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగళ్లు సమీపాన మల్లయ్యకొండపై వెలసిన శ్రీ అఖండమల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో పోటెత్తింది. శనివారం ఉదయం అఖండ మల్లేశ్వరస్వామి ఆలయంలో గోపూజతో ప్రారంభమై గంగాపూజ, స్వస్థినావా చనం, నాంది వృద్ధికరణం, కలశంపూజా, మహామంగళి హారతి, పూజలు నిర్వహించారు. రాత్రికి భక్తుల శివపార్వతుల కళ్యాణోత్సవం అనంతరం భక్తా దులు కాలక్షేపం కోసం మౌనిక భరతనాట్యం, కోలాటాలు, చెక్కభజనలు, నిర్వహించారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చాందీని బండ్లుల్లో కోలాటాలు, భజనలు, దేవరెద్దును ఊరేగించి తమ మొక్కుబడులను చెల్లించారు.ఆదివారం రాత్రి జాగరణ చేసిన వారికి అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. సోమవారం కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛైర్మెన్ కాకర్ల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు.

## వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ప్రొద్దుటూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి డా.జి.వి ప్రవీణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం 27వ రోజు ప్రొద్దుటూరు మండలంలోని వివేకానంద నగర్ లో ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, ఆవుల అరుణ్ తేజ, గంగోటి నాగ మల్లయ్య, బత్తల వెంకటేష్, రామచంద్రుడు, రాజేష్, రాము, క్యాటరింగ్ శివ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, ప్రొద్దుటూరు నియోజకవర్గం బిసీ సెల్ అధ్యక్షుడు తమ్మిశెట్టి సురేంద్ర, టిఎన్టీయుసి పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసులు, పెన్నా నగర్ మజీద్,టిడిపి నాయ కులు కార్యకర్తలు నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి వాటర్, ఆర్ఓ ప్లాంట్ వితరణ

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



స్థానిక దొరసాని పల్లె బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం నం దు సోమవారం వివేకానంద ఫౌండే షన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన వాటర్ ఆర్.ఓ. ప్లాంట్ ను వన్ టౌన్ సిఐ కె. రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద ఫౌండేషన్ వ్యవ స్థాపకులు పాపిజెన్ని రామ కృష్ణా రెడ్డి గత 13 ఏళ్ళుగా తనకు బాగా సుపరిచతుడన్నారు. చిన్న వయస్సులోనే సమాజసేవకు అంకితమైన రామకృష్ణ తన సేవా కార్య క్రమాలు నిర్వహిస్తూ నేటి యువతకు ఆదర్శ ప్రాయుడుగా నిలుస్తున్నా రన్నారు. తాను సేవ చేయటమేగాక తన తోటి సంస్థలకు, ఆశ్రమాలకు సహాయం చేయటం ఆయన గొప్ప తనాన్నికి నిదర్శనమన్నారు. అందులో భాగంగానే వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంనకు మంచి నీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. ఆశ్రమంలోని అవ్వతాతలందరూ గతమంతా వదిలేసి చివరి దశలో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం వృద్ధులకు ఆయన అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు రామకృష్ణా రెడ్డి, శ్రీనివాస రెడ్డి, సురేష్ వృద్ధాశ్రమం నిర్వాహకులు సుబ్బారాయుడు ను, సిఐ రాజారెడ్డి ని ఘనంగా సన్మానించారు.

## ఇంటి పన్ను పేరు మార్పుపై పెరిగిన రుసుములు

**కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



టైటిల్ ట్రాన్స్ ఫర్ ప్రాపర్టీ(టీటీపీఆర్) ఇంటి పన్ను పేరు మార్పుపై నూతన రుసుములు 20వ తేదీ నుంచి తక్షణమే అమలులోకి వచ్చినట్లు రెవెన్యూ ఇన్ స్పెక్టర్, మేయర్ సీసీ పి.విశ్వ నాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగర పాలక సంస్థలో ఆయన మాట్లాడుతూ వారసత్వం పేరు మార్పు రుసుములు రూ.2వేలు యథావిధిగా ఉన్నట్లు తెలిపారు. రూపాయి నుంచి రూ.50వేల వరకు రూ.2వేల నుంచి యథా విధంగా ఉన్నట్లు చెప్పారు. రూ.1002 నుంచి రూ.లక్ష వరకు రూ.2వేలు రుసుము, రూ.1.01లక్షల నుంచి రూ.5లక్షల వరకు రూ.4వేలు రుసుము, రూ.5లక్షల 1 నుంచి రూ.10లక్షల వరకు రూ.5వేలు రుసుము, రూ.10లక్షల 1 నుంచి రూ.20లక్షల వరకు రూ.10 వేలు రుసుములు యథా విధంగా ఉన్నట్లు తెలిపారు. రూ.20లక్షల 1 నుంచి రూ.50లక్షల వరకు రూ.15వేలు ఉన్న రుసుమును రూ.20వేల వరకు పెరిగినట్లు వెల్లడించారు.

## దౌలతాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు

**కడప లీగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం చెన్నూరు మండలం ఎస్టీ కాలనీ, దౌలతాపురం నందు సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎస్.కవిత నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం, లింగం, శారీరక వివక్షత, నిరక్షరాస్యత మరియు మతపరమైన వివక్షను తొలగించడానికి సామాజిక న్యాయం అందు బాటులోకి రావాలి అన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20వ తేదీ ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం పాటించాలని జనరల్ అసెంబ్లీ నవంబరు 26వ తేదీ 2007 నిర్ణయించింది. పెరుగుతున్న అసమానతలు సంఘర్షణలు మరియు బలహీనమైన సంస్థల ద్వారా విచ్ఛిన్నమైన సామాజిక ఒప్పందాన్ని బలోపేతం చేయడానికి సభ్య దేశాలు యువత సామాజిక భాగస్వామ్యులు పౌర సమాజం యూఎస్ సంస్థలు సామాజిక న్యాయం ప్రోత్సహించడానికి అవకాశాన్నిస్తోందని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, న్యాయవాది చంద్రకాంతమ్మ. పారా లీగల్ వాలంటరీ అరుణ కుమారి, ప్రజలు పాల్గొన్నారు.

## ముదురుతున్న దర్గా స్థల వివాదం..

**కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



నగరంలోని మోచంపేటలో వెలసిన హజరత్ రకీబ్‌షా వలీ దర్గాకు సంబం ధించిన 5.75 ఎకరాల స్థలం కొద్ది నెలలుగా వివాదంగా మారింది. దర్గాకు ఎదురుగా ఉన్న శ్రీ రామకృష్ణా హైస్కూలుకు సంబంధించిన స్థలం అని స్కూలు యాజమాన్యం నిర్మాణ పనులు చేపట్టడంతో చిలికి చిలికి గాలి వానలా మారింది. 1868లో అప్పటి ఆంగ్లేయుల పరిపాలకులు దానంగా ఇచ్చారని అందుకు మా వద్ద ఆధారాలున్నాయని ఒక వర్గం. 1952 నుంచి మాకు చెందిన స్థలమని స్కూలు యాజమాన్యం. దీంతో దర్గా కమిటీకి సంబంధించిన ఒక వర్గం రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంను ఆశ్రయించి స్టేటస్‌కు ఓ ఇంటరీమ్ ఆర్డర్ తెచ్చారు. ఇది తెలుసో తెలియకో కానీ స్కూలు యాజమాన్యం సంబంధీకులు నిర్మాణం చేయాలని పనులు ప్రారంభించారు. నిర్మాణం చేయకూడదని అభ్యం తరం తెలిపి దర్గా కమిటీ సంబంధీకులు నిరసన వ్యక్తం చేశారు. చివరికి వివాద స్థలం కాస్త రాజకీయ రంగు పులుముకుంది. ఈ విషయంపై ఆర్డీఓ, ఎమ్మార్వో లు జోక్యం చేసుకొని దర్గాకు కేవలం 20 సెంట్ల స్థలం ఉన్నట్లు గుర్తించామని, అక్కడున్న మసీదుకు 8 సెంట్లు స్థలంగా వక్ఫ్‌బోర్డులో ఉన్నట్లు తెలిపారు. స్థల వివాదం పక్కన పెడితే నగరంలోని ముస్లిం మైనార్టీలలో రాజకీయాలు చీలికలు తెచ్చా యన్న మాట వాస్తవం. ఈ విషయమై డిప్యూటీ సీఎం, మైనార్టీ శాఖా మాత్యులు అంజాద్‌బాషా జోక్యం చేసుకొని ఎటువంటి ఉద్రిక్తతలు చోటు చేసు కోకుండా దర్గా, స్కూలుకు స్థల విషయంలో న్యాయం జరిగేలా కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఎస్టీ జోసెఫ్ ఇ.ఎం.హైస్కూల్ 40వ వార్షికోత్సవ వేడుకలు

**కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**



విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థాయికి ఎదగ డానికి ఎంతో ఉపయోగపడుతుందని కడప డయాసిస్ అపోస్లోనిక్ అడ్మిని స్ట్రేటర్ రెవరెండ్ బిషప్ డా.గాలి బాలి ఆధ్వర్యంలో 40వ వార్షికో త్సవ వేడుకలు జరిగాయని డిప్యూటీ మేనేజర్ కరస్పాండెంట్ ఫాదర్ దేవరాసు అన్నారు. మరియాపురంలోని ఎస్టీ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 40వ వార్షికోత్సవ వేడుకలను కర స్పాండెంట్ ఫాదర్ దేవదాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు విద్యతో పాటు తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. అనంతరం డీఈవో దేవరాజు జోసెఫ్ హైస్కూల్‌కు ప్రత్యేకత ఉందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో నడవడిక తెలుసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మాత డైరెక్టర్ ఆఫ్ డీన్ అబ్రహం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీదారులను నిర్లక్ష్యం చేయరాదు

### -జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్



రాయచోటి .ఫిబ్రవరి20 ప్రభాతవార్త

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయరాదని గడవులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయప్రయాసలుకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారు. అధికారులు బాధితులు సమ్యలు గుర్తించి వారి సమస్యలను పదే పదే కార్యాలయాలు చుట్టు తిప్పుకోకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం స్పందన కార్య క్రమంలో వచ్చిన అర్జీలను శనివారంలోగా క్లియర్ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేసిందని ఉద్యోగులందరూ ఎపిఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తప్పకుండా 100 శాతం ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో సత్యనారాయణ, డ్వామా పిడి మద్దిలేటి, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

## గంజాయి స్వాధీనం - నిందితుడు పరారీ

కడప క్రైం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

కడప నగరంలోని తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో తారక రామనగర్‌లో పూల రాజేష్ అనే వ్యక్తి తన ఇంట్లో గంజాయిని నిల్వ ఉంచుకొని బయట రహదారి పక్కన చిన్న చిన్న పొట్లాలతో వ్యాపారం చేస్తుండగా సీఐ కె.ఉలసయ్య, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఒకటిన్నర కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడు పూల రాజేష్ పరారయ్యాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## విద్యార్థులకు జీరో బాలెన్స్ ద్వారా అకౌంట్‌లు

గాలివీడు , ఫిబ్రవరి20 ప్రభాతవార్త

ఏపిజీబి బ్యాంక్‌లలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులకు జీరో బ్యాలెన్స్ ద్వారా అకౌంట్‌ను ఓపెన్ చేస్తున్నామని బ్యాంక్ మేనేజర్ బాలాజి పేర్కొన్నారు. సోమవారం నూలివీడులోని ఆవులరెడ్డిగారిపల్లిలోని ఓ ప్రవేట్ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు కళాజాతర ద్వారా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిజిబి బ్యాంక్ ద్వారా డిపాజిట్ దారులకు అత్యధిక వడ్డీని అందజేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన వారికి బంగారు రుణాలు ట్రాక్టర్ లోన్‌లు, ఎడ్యుకేషన్ లోన్‌లు, హౌసింగ్ లోన్‌లు వంటివి ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాజాత సభ్యులు, బ్యాంక్ సిబ్బంది శీను తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతరకు భారీగా తరలి వెళుతున్న చెరుకులు

రామాపురం .ఫిబ్రవరి20

ప్రభాతవార్త



లక్కిరెడ్డిపల్లి మండలంలో ఈ నెల 21, 22వ తేదీలలో జరుగుతున్న అనంతపురం గంగమ్మ జాతరకు చెరుకులు ట్రాక్టర్‌లలో భారీగా తరలి వెళుతున్నాయి. ఈ జాతరకు కడప, కమలాపురం, చెన్నూరు, ఖాజీపేట, మైదుకూరు, చింతకొమ్మదిన్నె మండలాల నుంచి ట్రాక్టర్‌ల ద్వారా చెరుకులను జాతరకు తరలిస్తున్నారు.

## విందులో పాల్గొన్న ప్రసాద్‌బాబు

చిన్నమండెం, ఫిబ్రవరి20 ప్రభాతవార్త



మండలంలోని చాకిబండ గ్రామం రెడ్డివారిపల్లిలో వెంకటరామిరెడ్డి, రుద్రారెడ్డి ఇచ్చిన విందులో సోమవారం మాజీ టిటిడి పాలకమండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ గ్రామంలో ఆదివారం రాత్రి పోలిమేరమ్మ జాతర జరిగింది. సోమవారం గ్రామంలో విందు బోజనాలు జరిగాయి. ఈ విందుకు వీరి ఆహ్వానం మేరకు ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి రెడ్డెయ్య, లాయర్ సతీస్‌రెడ్డి, బుద్దా శ్రీనివాసులు, మన్నేరు రామాంజులు, బడిశెట్టి రవి, కెసి ప్రసాద్, మస్తాన్, కోటి తదితరులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లెలో వ్యక్తి దారుణ హత్య



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లి లోని కొత్తకోటలు లో నీ వెంకటసుబ్బయ్య 52 అనే వ్యక్తిని కత్తితో మునీంద్ర అనే వ్యక్తి కత్తితో అతి దారుణంగా అతి దారుణంగా సోమవారం రాత్రి హత్య చేశారు. పోలీస్ మేరకు వివరాల మేరకు హత్యకాపడ్డ వ్యక్తి చెన్నూరు మండలం బొచ్చంపల్లికి చెందిన వ్యక్తిని అలంకానపల్లి గ్రామానికి చెందిన లలితమ్మ ఇద్దరు కలసి ఐదు సంవత్సరాలుగా అక్రసంబంధం జరుగుతుంది తన సొంత గ్రామంలో అందరికి తెలుస్తుందని మేరకు లక్కిరెడ్డిపల్లెలోని ఓ గృహాన్ని అద్దెకు తీసుకొని అక్కడ ఇద్దరు కలిసి బేల్దారి పనులు చేసుకుంటూ జీవన సాగించేవారు. సోమవారం వీరిద్దరి మధ్య గొడవ రావడంతో అలంకానిపల్లి నుంచి వచ్చిన లలితమ్మ కుమారుడు వెంకటసుబ్బయ్యను కత్తితో లలితమ్మ కుమారుడు మునీంద్ర అతి దారుణంగా పొడిచి చంపాడని పోలీసులు తెలిపారు వెంకటసుబ్బయ్య హత్యపై విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు ఈ మేరకు పోలీసులు నిందితుని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నాలుగులైన్ల రహదారి ఆటంకాలను నియంత్రించండి

### -స్పందనలో కలెక్టర్‌కు పిర్యాదు

గాలివీడు .ఫిబ్రవరి20 ప్రభాతవార్త

మండల కేంద్రంలో నాలుగులైన్‌ల రహదారి లక్ష్యాలను ఆటంకం సృష్టిస్తూ రోడ్డుకడ్డుగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న వ్యాపార సముదాయాలు, వాహనదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపి మండల అద్యక్షుడు గొట్లమిట్ల శ్రీనివాసులు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కార దిశగా రహదారి అభివృద్ధిలో భాగంగా రూ.7కోట్ల రూపాయల నిధులు వెచ్చించి డివైడర్‌లను ఏర్పాటు చేసి నాలుగులైన్‌ల రహదారి పనులు ముగింపు దశకు చేరుకున్నా కొందరు స్థానికులు, దుకాణాదారులు, వాహనదారులు నిర్లక్ష్యధోరణితో ఫుట్‌పాత్‌ను దాటి రోడ్డుకు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో 108 వాహనాలు వెళ్లలేక, ప్రమాదాలు బారిన పడుతూ తీవ్ర సమస్యలు ఎదుర్కోవలసి వస్తోందని పిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో నాలుగులైన్‌ల రహదారి కాస్త రెండు లైన్‌ల రహదారిగా కుచించుకుపోయి, ఇంతలా ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్న వారిపై కనీసం సచివాలయ సిబ్బంది, పంచాయతీ, రెవెన్యూ యంత్రాంగం గాని, ఆర్ అండ్ బి అధికారులు కానీ చర్యలు తీసుకోకపోవడం దారుణమని పిర్యాదులో స్పష్టం చేశారు. వెంటనే సంబందిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ప్రాధమికోన్నత ఆరోగ్య కేంద్రానికి తాళాలు

### అవార్డులు పొందిన ఆరోగ్య కేంద్రం నేడు మూతపడింది

### ఒకపూట మాత్రమే పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రం

### సిబ్బంది కొరత అని అంటున్న వైద్యులు




తాళాలు వేసిన ఆరోగ్య కేంద్రం

నందలూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

నందలూరు కేంద్రంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటలు పనిచేసే ఎన్నో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ఉత్తమ సేవలందించినందుకు అవార్డులు పొందిన ఆరోగ్య కేంద్రం నేడు ఉద్యోగుల కొరతతో ఒకపూట మాత్రమే పనిచేస్తూ ఉండడం దారుణం. రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ సేవలు అందించినందుకుగాను రెండో స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఈ ప్రాథమిక కేంద్రం ప్రస్తుతం ఉదయం వేళల్లో మాత్రమే తెరిచి మధ్యాహ్నం సమయంలో ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసి ఉంచారు. రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి సొంత మండలమైన నందలూరులో ఈ పరిస్థితి ఉంటే మిగిలిన మండలాల్లో పరిస్థితులు ఏవిధంగా ఉంటాయో ఊహించుకోవచ్చు. వాతావరణ మార్పు వల్ల ప్రజల్లో జ్వరాలు అధికంగా ఉన్న సమయంలో ఆరోగ్య కేంద్రానికి తాళం వేయడం ఎంతవరకు సమంజసమని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లేక ప్రైవేటు ఆసుపత్రుల వైపు ప్రజలు చూస్తున్నారని, ఇద్దరు డాక్టర్లు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామాల్లో ఉన్న ఉపకేంద్రాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. దీనిపై డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా స్టాఫ్‌నర్సు ముగ్గురు ఉంటే మూడు షిఫ్టులు పని చేస్తామని ఇద్దరు ఉండడం వల్ల ఉదయం ఒకరు, రాత్రి ఒకరు పనిచేస్తున్నారని, మధ్యాహ్న సమయంలో ఆసుపత్రి మూసివేస్తున్నామన్నారు. ఏమైనా అత్యవసర కేసులు వస్తే పరిస్థితి ఏమిటని అడుగ్గా 108లో ఎక్కించి రాజంపేట, కడప ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తామని సునాయాసంగా చెప్పడం చూస్తుంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది. దీనిపై పైస్థాయి అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి . ఇలాగే వదిలేస్తారా లేక ఉద్యోగులను ఎంపిక చేసి ఆరోగ్య కేంద్రాన్ని నడిపిస్తారో తెలియాల్సి ఉంది.

## గిరిజనులకు ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల హర్షం..

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 20,

ప్రభాతవార్త:



గవర్నర్ కోటాలో మొదటి సారిగా గిరిజనులకు ఏపీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ కేటాయించడం పట్ల వైసీపీ నాయకులు డా.ఐ.శివానాయక్ ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మొదటి సారిగా గిరిజనులను గుర్తించి ఈ స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు.

## ఈఈఎంటీ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన హఫీజున్

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:



మండలంలోని నందిమండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న హఫీజున్ ఈఈఎంటీ పరీక్షా ఫలితాల్లో 65 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కళావతి తెలిపారు. హఫీజున్ 2021లో జరిగిన ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో కూడా విజయం సాధించిందన్నారు. హఫీజున్‌ను తీర్చిదిద్ది స్కాలర్‌షిప్‌లు పొందేందుకు విశేష కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు విద్యార్థినిని చదివిస్తున్న తాత మహబూబ్‌బాషాను, మరియు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ చెక్‌పోస్టు ఉన్నా.. అధికారుల పహారా సున్నా..!!

### సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం - చికెన్ వ్యర్థాల సరఫరాపై చర్యలు తీసుకోని వైనం

చిట్వేలి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా నెల్లూరు సరిహద్దు ప్రాంతమైన రాజుకుంట క్రాస్‌వద్ద పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసి ఎర్రచందనం, రేషన్‌బియ్యం, మత్తు పదార్థాల రవాణా తదితర లాంటివి అరికట్టంలో ప్రధానపాత్ర పోషించేందుకై ఈ చెక్‌పోస్టుని ఏర్పాటు చేసినప్పటికీ వాస్తవంలో మాత్రం పోలీస్ చెక్‌పోస్టు ఉన్నా.. అధికారుల పహారా సున్నా..!! అన్న రీతి ఇక్కడ కనిపిస్తూ ఉంది. వారంలో రెండు మూడు రోజులు మినహాయించి మిగతా రోజుల్లో ఇక్కడ అధికారులు కనిపించకపోవడం పలు విమర్శలకు దారితీస్తూ ఉంది. ప్రతినిత్యం రేషన్ బియ్యం తరలివెళుతున్న పోలీసు చెక్‌పోస్టు దగ్గర, ఫారెస్ట్ చెక్‌పోస్టు దగ్గర ఉన్న అధికారులకు వ్యాపారులు లంచాలను ఇస్తూ తమ పని చక్కదిద్దుకుంటున్నారన్న వాస్తవాలు స్థానికుల నుంచి గుప్పుమంటున్నాయి. చికెన్ వ్యర్థాలను తరలించి చేపలకు మేతగా ఉపయోగిస్తూ ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కోట్లు గడిస్తున్నా వాటిని ఆపలేకపోవడం, కనీసం దుర్గంధపు వాసన వెదజల్లుతూ దారివెంబడి వెళుతున్న వాహనాలకు పైకప్పుగా తార్పన్ పట్టలను ఉపయోగించమని సూచించలేకపోవడం ఇక్కడ అధికారులు నిర్వహిస్తున్న విధులకు ఎంతటి బలం ఉన్నదో చెప్పకనే చెప్పవచ్చు. కాగా రేషన్ బియ్యంతో ప్రతినిత్యం వెళుతున్న వాహనాలను ఫారెస్ట్ చెక్‌పోస్టు దగ్గర రిజిస్టర్లో నమోదు చేయకుండా పంపుతున్నారన్న విమర్శలు స్థానికుల నుంచి జోరుగా వినపడుతున్నాయి. ఇట్టి విషయాలను గుర్తు తిరిగి పై అధికారులు గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం, మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవడం చేయకపోతే ప్రభుత్వం యొక్క లక్ష్యం నీరుగానే ప్రమాదం ఎంతో దూరంలో లేదన్న వాస్తవాన్ని గుర్తించాలని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

## వైభవంగా పుష్ప రథోత్సవం



భక్తులకు మహా ప్రసాదం అందిస్తున్న ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ.

బ్రహ్మంగారి మఠం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం మహా ప్రసాదాన్ని దేవాదాయ శాఖ సహాయ కమీషనర్, ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ భక్తులకు అందజేశారు. ఉదయం సుప్రభాతంతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు 7 గంటలకు అభిషేకం, సహస్ర నామార్చన, 10 గంటలకు నిత్య హోమం, బలిహారణ, రథోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు మహా ప్రసాద వినియోగం, రాత్రి 9 గంటలకు మాడ వీధులలో పుష్ప రథోత్సవం భక్తులు మరియు స్థానికుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పూర్వపు మఠాధిపతి స్వర్గీయ శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి కుమారులు నొస్సం వెంకటాద్రి స్వామి, వారి సోదరులు శ్రీ వీరభద్రయ్య స్వామి, శ్రీ వీరంబట్లయ్య స్వామి, శ్రీ దత్తాత్రేయ స్వామితో పాటు పూర్వపు మఠాధిపతి రెండవ భార్య శ్రీ మారుతీ మహాలక్షుమ్మ కుమారులు ప్రతి రోజూ జరిగే ఉత్సవాలలో పాల్గొనడం జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల చివరి రోజు మంగళవారం వసంతోత్సవంతో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న మహా శివరాత్రి కల్యాణ మహోత్సవాలు ముగియనున్నట్లు మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పేర్కొన్నారు. ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లతో పాటు, దేవస్థాన పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విద్యా సాగర్ వారి సిబ్బంది ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

### భాధ్య ఎంఇఒ గంగిరెడ్డి



నందలూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ అకడమిక్ కార్యకలాపాల్లో చురుకుగా ఆపల్గొనాలని మండల భాధ్య విద్యాశాఖాధికారి డి.గంగిరెడ్డి తెలిపారు. మండంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం మధ్యాహ్నం మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఇఒ గంగిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించి నాడు నేడు పనులు, యు-డైస్ వివరాలు నమోదు, మధ్యాహ్న భోజనం, శానిటేషన్ నిర్వహణ, హైస్కూల్ విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌ల వినియోగం, జగనన్న విద్యా కానుక, బైజూస్ కంటెంట్ వినియోగం తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హైస్కూల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు లిప్ ప్రోగ్రామ్‌ను తప్పక అమలు చేస్తూ పరీక్షలు నిర్వహించాలని, 3 నుంచి 10 తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌లే బోధించాలని, దానికనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడూ తప్పనిసరిగా లెసన్ ప్లాన్, డైరీ రాయాలని, విద్యార్థుల నోటుపుస్తకాలను, వర్కు బుక్‌లను కరెక్షన్ చేయాలని, మూల్యాంకన పత్రాలను ఎప్పటికప్పుడు దిద్ది, మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కాంప్లెక్సు ఛైర్మన్‌లు ఐజాక్ స్టాలిన్, శివరామ్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గిరిజాకుమారి, మాధవీలత, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఆర్‌పిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెలరకు అత్యున్నత 2 ఎమ్మెల్సి స్థానాలు ఇవ్వడం పట్ల హర్షం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



బత్తల సుబ్రమణ్యం

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇద్దరు వడ్డెరలకు ఎమ్మెల్సి స్థానాలు ఇవ్వడం అత్యంత గొప్ప విషయమని రైల్వేకోడూరు వైసిపి బిసి విజిలెన్స్ మానటరింగ్ సభ్యులు బత్తల సుబ్రమణ్యం అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 75 సంవత్సరాల రాజకీయ చరిత్రలో వడ్డెరలను అత్యున్నత స్థానాల్లో ఎమ్మెల్సి పదవులు ఇవ్వడం అత్యంత గౌరవమైన విషయమని, అంత సాహోసోపేత నిర్ణయాన్ని దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వడ్డెర సంఘ కులస్థులైన చంద్రగిరి యేసురత్నం, జైమంగళం వెంకటరమణలు ఇద్దరికి ఎమ్మెల్సి స్థానాలు ఇవ్వడం పట్ల రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన వడ్డెర నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తండ్రిబాటలోనే తనయుడు కూడ ఇచ్చిన మాటకు కట్టుబడి బిసిలకు అత్యున్నత గౌరమైన పదవులను ఇస్తున్నారని, బిసిలు ఎప్పటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే మద్ధతు ఇస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వెంకటేశ్, వడ్డెర సంఘ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చాగలగుట్టపల్లె గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

### ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

ప్రజలందరూ సుభిక్షంగా, చల్లగా ఉండేలా కరుణించి కాపాడు తల్లీ అంటూ చాగలగుట్టపల్లె గంగమ్మ తల్లికి అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ జాతర సందర్భంగా సోమవారం రాత్రి మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె గ్రామం చాగలుట్టపల్లెలోని అమ్మవారి జాగారంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, లాల్లుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని భక్తులకు వడ్డించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జాగారానికి వచ్చిన భక్తులకు అభినందనలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సిద్దక రామచంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు, లక్కిరెడ్డిపల్లె ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ శంకర్ నాయుడు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు అంబబా బత్తిన రమేష్, వెంకటేష్, గురుమూర్తి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిని బెదిరించి రూ.6వేలు స్వాధీనం

### - ఆరుగురిపై కేసు నమోదు

కడప క్రైం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: కడప నగరంలోని తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న సుధాకర్ అనే వ్యక్తిని, జయకృష్ణ, ఇంకా కొంత మంది బెదిరించి రూ.6వేలు వసూలు చేశారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ ఉలసయ్య తెలిపారు.

## మానవతా విలువలు పెంపొందించుకోవాలి

### -తల్లిదండ్రుల నడిచే దేవుళ్లు

### వాత్సల్య భారతి గౌరవాధ్యక్షులు మల్లుబట్ల కుమారస్వామి వెల్లడి

సంబేపల్లి .ఫిబ్రవరి20

ప్రభాతవార్త



విద్యార్థులలో చిన్ననాటి నుండే దేశభక్తి, మాతృభక్తి, మానవతా విలువలు పెంపొందించుకోవాలని వాత్సల్య భారతి సంస్థ గౌరవాధ్యక్షులు మల్లుబట్ల కుమారస్వామి అన్నారు. సోమవారం ఉదయం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు దేశభక్తి, అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తనకు గల బాధ్యతను అంకిత భావంతో నిర్వర్తించడమే దేశ భక్తి కలిగి ఉండడం అన్నారు. ప్రస్తుతం సమాజంలో కుటుంబ వ్యవస్థ, మనుషుల విలువలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంస్థ జాయింట్ సెక్రటరీ సిద్దాంతి అరిందం కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. కృషి పట్టుదల కలిగి ఉండి అనుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపుదల కోసం ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎస్ చంద్రశేఖర్, ప్రదానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీఫ్‌కుమార్, ఉపాధ్యాయినిలు ఉమాదేవి, సుజాత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కేంద్రం అర్జీదారుల, ప్రజల ఆకలి తీరుస్తుండటం ఆనందదాయకం : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోట, ఫిబ్రవరి20

ప్రభాతవార్త



జిల్లా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రం గ్రీవెన్‌సెల్ అర్జీదారులకు, ప్రజలుకు ఆకలి తీరుస్తుండటం ఆనందదాయకంగా ఉందని వైఎస్సార్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సిపి నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్ సౌజన్యంతో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి అర్జీదారులకు, ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి గ్రీవెన్‌సెల్ రోజున సోమవారం నాడు పేదల కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలకు వస్తుంటారని, బోజనాలకు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన అన్నదానం నేటితో పదవ వారం అయిందన్నారు. ఉచిత అన్నదానం కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అన్నదాన కార్యక్రమానికి కొంతమంది దాతలు ముందుకు వస్తుండటం అభినందనీయమన్నారు. వారం వారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సౌజన్యంతో గ్రీవెన్‌సెల్ రోజున జిల్లా వ్యాప్తంగా వచ్చే ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన బోజనాన్ని అందిస్తుండటంపై హర్షం వ్యక్తం చేస్తు అన్నదాతలు సుఖీభవ అంటూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అభినందిస్తూ, దీవెనలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకులు పల్లపురమేష్, గాలివీడు వైస్ ఎంపిపి మధుబూషణ్‌రెడ్డి, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, అన్నాసలీం, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, గంగిరెడ్డి, జావీద్, అమీర్, కొత్తపల్లి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తారకరత్న మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది

### -టిడిపి మండల నాయకులు

చిన్నమండెం .ఫిబ్రవరి20

ప్రభాతవార్త



ప్రముఖ సినీ హీరో నందమూరి తారకరత్న అకాలమరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మండల టిడిపి నాయకులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు చింతిస్తూ సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గత 23 రోజులు క్రితం గుండెపోటుతో బెంగళూరులోని నారాయణ హృదయాలయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి అకాల మరణం చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తేదేపా మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహీద్‌ఖాన్, దేవగుడిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున, తెలుగు యువత నాయకులు రాంప్రసాద్‌నాయుడు, రాజంపేట బిసి సెల్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, బాలచంద్రయాదవ్, అంజి, వెంకటేష్, సతీస్ రాయల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత గంగమ్మ తల్లికి బోనాలు

రామాపురం , ఫిబ్రవరి20

ప్రభాతవార్త



మండలంలోని కల్పనాయుని చెరువు పంచాయతీ గాండ్ల గుండ్లపల్లి హరిజనవాడలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన గంగమ్మ తల్లి ఆలయానికి సోమవారం గ్రామంలోని ప్రజలు నాగరాణీ బాబు ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. భక్తి శ్రద్దలతో ఉదయం నుంచి గ్రామంలో అమ్మవారికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. మొక్కుబడులు చేర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యి అమ్మవారిని దర్శించుకున్నారు.

## తారకరత్న మృతి పార్టీకి తీరనిలోటు

### పంతగాని నరసింహప్రసాద్

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ యువ నాయకులు నందమూరి తారకరత్న ఆకస్మిక మృతి తెలుగుదేశంపార్టీ తీరని లోటు అని రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ నాయకులు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న తారకరత్న ఆకస్మికంగా మృతిచెందడం అత్యంత బాధాకరమైన విషయమని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. అదేవిధంగా బెంగుళూరులో నారాయణ హృద యాలయ వైద్యులు శాయశక్తుల పోరాడినా విధి విక్రీకరించిందన్నారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పంతగాని నరసిం హప్రసాద్ అన్నారు. రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, కూని చంద్రయ్య, అమర్, సుబ్బరాయుడు, హరి, కస్తూరి దినేష్ తదితరులు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే విశ్వనాథరెడ్డి జయంతి వేడుకలు

వీరబల్లి , ఫిబ్రవరి20

ప్రభాతవార్త



వీరబల్లి మండలం పూర్వపు లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గపు మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి జయంతి వేడుకలను సోమవారం తన స్వగృహంలో నిర్వహించారు. తన కుమారులైన వైసిపి నాయకులు విజ యభాస్కర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మనవడు మధు సూధన్‌రెడ్డితో కలిసి ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి గంగమ్మ గుడిలో కుటుంబ సభ్యులతో కలిసి